త్వరలో సీఎం చేతులమీదుగా ఎస్టీపీ ప్లాంట్ ప్రారంభం


నిర్మాణంలో ఉన్న ఎస్టీపీ ప్లాంట్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

నాగోలు: ఎల్‌బీనగర్ నియోజకవర్గంలోని నాగోలు ఫతుల్లాగూడ రూ. 459 కోట్లతో ఎస్.బి.ఆర్ (సీక్వెన్సార్ బ్యాక్ రియాక్టర్) టెక్నాలజీ సాయంతో నిర్మాణం చేసిన ఎస్టీపీ ప్లాంట్‌ను త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభిస్తున్నట్లు ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి తెలిపారు. సోమవారం నాగోలు పరిధిలో ఫతుల్లాగూడలో దేశంలో మొదటిసారిగా అత్యాధునిక ఎస్.బి.ఆర్(సీక్వెన్సార్ బ్యాక్ రియాక్టర్) టెక్నాలజీ సాయంతో దాదాపు రూ. 450 కోట్ల రూపాయలతో జరుగుతున్న ఎస్టీపీ అభివృద్ధి పనులను సుధీర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ ఇక్కడ నిర్మాణం చేసే ప్లాంట్‌లో రోజుకు దాదాపు 320 ఏం.ఎల్.డి. మురుగునీరు శుద్ధి చేయడం జరుగుతుందని తెలిపారు. దేశంలోనే అతి పెద్ద ప్లాంట్ ఇదే అని తెలిపారు. మరో రెండు సంవత్సరాల తర్వాత ముంబయిలో నిర్మిస్తారని, మూసీనది ప్రక్షాళనలో భాగంగా ఈ నిర్మాణం చేపట్టడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. గతంలో మూసీ సుందరీకరణలో పనుల్లో భాగంగా మూసీ చైర్మన్‌గా నియామకం అయిన సందర్భంగా 2022 సంవత్సరంలో శంకుస్థాపన చేయడం జరిగిందని తెలిపారు. ప్రస్తుతం పనులు చివరి దశకు చేరుకున్నాయన్నారు. జంట నగరాల్లో సౌత్ సైడ్ ఉన్న బాపూఘాట్ నుంచి వచ్చే మురికినీరు నయాపుల్ గుండా ఇక్కడి వరకు రావడం జరుగుతుందని, అక్కడి నుంచి వచ్చే సీవరేజీ నీరు ఇక్కడ శుద్ధి చేసి మూసీలోకి వదలడం జరుగుతుందన్నారు. నెలలోపు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా అధికారులు ఈ ప్లాంట్ ప్రారంభించడానికి సన్నాహాలు జరుపుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు అనంతుల రాజిరెడ్డి, తూర్పాటి చిరంజీవి, సతీష్, మధుసాగర్ అధికారులు రాజ్ కుమార్, రజినీకాంత్, రమేష్, నవీన్, కాశయ్య తదితరులు పాల్గొన్నారు.

పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలి


పీస్ కమిటీ సమావేశంలో డీసీపీ సుభాష్

సైదాబాద్: పండుగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సౌత్‌ఈస్ట్ జోన్ డీసీపీ పాటిల్ కాంతిలాల్ సుభాష్ అన్నారు. సోమవారం సైదాబాద్ పోలీస్‌స్టేషన్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన పీస్ అండ్ మైత్రీ కమిటీ సభ్యుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మొహర్రం, బోనాల పండుగలను శాంతియుతంగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని కోరారు. పీస్ కమిటీ సభ్యులు పోలీసులు ప్రజలకు వారధిగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సౌత్‌ఈస్ట్ జోన్ ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది, మైత్రీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉంటేనే వ్యాధులు దరిచేరవు


సీజనల్ వ్యాధులపై అవగాహన ర్యాలీలో కార్పొరేటర్ ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డి

చైతన్యపురి: వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉంటేనే అవి దరిచేరవని గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి సూచించారు. జీహెచ్‌ఎంజీ ఎంటమాలజీ సిబ్బంది ఆధ్వర్యంలో డివిజన్‌లోని కోదండరాంనగర్, సీసల బస్తీలలో డెంగీ, మలేరియా వ్యాధులపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ దోమల వల్ల మలేరియా, చికెన్ గున్యా, మెదడు వాపు వ్యాప్తి చెందే అవకాశం ఉందన్నారు. దోమలు వ్యాప్తి చెందకుండా సంపులు, కూలర్లు, డ్రమ్ములు, పూలకుండీలు, పాత వస్తువులలో నీటి నిల్వలు లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూసుకోవాలని, చెత్తా చెదారం రహదారులు, కాళీ స్థలాల్లో వేయవద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంటమాలజీ ఏఇ రాంబాబు, సూపర్‌వైజర్ అర్జున్, సిబ్బంది యాదగిరి. రాజు, కాలనీ వాసులు ఒట్టిరాజు, టింకు గోపి, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

కన్యకాపరమేశ్వరి ఆలయ నిర్మాణానికి ఆర్థిక సహాయం


ఆలయ నిర్మాణానికి ఆర్థిక సహాయం అందజేస్తున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్త

నాగోలు: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గంధంగూడలో వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానం నిర్మాణానికి ఉప్పల ఫౌండేషన్ చైర్మన్, టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్త ఆలయ కమిటీ సభ్యులకు రూ.1,11,000 లక్షల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానం నిర్మాణానికి తన వంతుగా ఆర్థిక సహాయం అందజేయడం జరిగిందని తెలిపారు. కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆశీస్సులతో అందరూ సంతోషంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. దేశ వ్యాప్తంగా వైశ్యులు అందరూ కలిసి మెలసి అన్ని రంగాల్లో రాణించాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు రావికంటి కిషన్ , వైస్ ప్రెసిడెంట్ మెడ సత్యనారాయణ, కార్యదర్శి సురేందర్, నరేష్, రాములు,లక్ష్మి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి నిరంతర కృషి

స్టామ్ వాటర్ లైన్ పనులు ప్రారంభించిన కార్పొరేటర్


స్టామ్ వాటర్ లైన్ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి, ఏఇ రూప

చైతన్యపురి: కాలనీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తానని గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం కమలానగర్ కాలనీ నుంచి నేతాజీనగర్ చౌరస్తా వరకు రూ. 90 లక్షల జీహెచ్‌ఎంసీ నిధులతో చేపట్టబోయే స్టామ్ వాటర్ లైన్ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ చిన్నపాటి వర్షానికే నేతాజీనగర్ నుంచి కమలానగర్ వైభవ్ టిఫిన్ సెంటర్ వరక వరదనీరు నిలిచి ఇబ్బందులు పడాల్సి వచ్చిందని దీంతో 2022లో నూతన స్టామ్ వాటర్ లైన్‌కు నిధులు మంజూరు అయినప్పటికీ పనులు పూర్తి కాలేదని అన్నారు. ఇదే విషయాన్ని నూతన జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ దృష్టికి తీసుకుని వెళ్లగా పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారన్నారు. ఈ పనులు పూర్తి అయితే రెండు కాలనీలలో వరద ముంపు సమస్య పరిష్కారం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఇ రూప, వర్క్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, కాంట్రాక్టర్ కేశవ, కమలానగర్ వాసులు సత్యనారాయణ, మాణిక్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదల గుండెల్లో చెరగని జ్ఞాపకం వైఎస్సార్

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 75వ జయంతి వేడుకలను పార్టీలకు అతీతంగా ఎల్‌బీనగర్, మన్సూరాబాద్, కొత్తపేట, దిల్‌సుఖ్‌నగర్ తదితర ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. కొత్తపేటలో ఎమ్మెల్యే దేవిరెడ్డిసుధీర్‌రెడ్డి, చిత్రాలేవుట్‌లో మాజీ ఎమ్మెల్యే కె. లక్ష్మారెడ్డిలతోపాటు వివిధ పార్టీలకు చెందిన నాయకులు వైఎస్‌ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్‌ఆర్ పాలనలో అభివృద్ధి, సంక్షేమాలతో ఉమ్మడి రాష్ట్రం పరిఢవిల్లిందన్నారు. ఎన్నో పథకాలను తీసుకొచ్చి పేద ప్రజల గుండెల్లో చెరగని ముద్రవేశారన్నారు. – మన్సూరాబాద్, దిల్‌సుఖ్‌నగర్


వైఎస్‌ఆర్‌కు నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కేఎల్‌ఆర్, దేప భాస్కర్‌రెడ్డి, చిలుక ఉపేందర్‌రెడ్డి


కొత్తపేట చౌరస్తాలోని వైఎస్సార్ విగ్రహానికి పూల మాల వేసి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి


కామినేని చౌరస్తాలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లు అర్పిస్తున్న బీఆర్‌ఎస్ నేత మామిడి రాంచందర్


కామినేని చౌరస్తాలో...


కర్మన్‌ఘాట్‌లో...

బోనాల ఉత్సవాలకు ఏర్పాట్లు చేయండి


డీసీ జయంత్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

చాదర్‌ఘాట్: ఓల్డ్‌మలక్‌పేట డివిజన్‌లో బోనాల ఉత్సవాలకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని గ్రేటర్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బాబు శ్రీనివాస్ అధికారులను కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన కాంగ్రెస్ నాయకులతో కలసి మలక్‌పేట సర్కిల్–6 డీసీ జయంత్‌ను కలసి వినతిపత్రం సమర్పించారు. డివిజన్‌లోని మహంకాళి దేవాలయం నుంచి నల్లపోచమ్మ ఆలయం వరకు సీసీ రోడ్డు ఏర్పాటు చేయాలని కోరారు. వీధి దీపాలకు మరమ్మతులు చేయించాలని వారు డీసీని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు చౌకి రవికుమార్, బి.విష్ణుదేవ్ పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు సహకరించండి


ఎం.రాజు

చాదర్‌ఘాట్: శాంతి భద్రతలను కాపాడటంలో ప్రతీ పౌరుడు బాధ్యత గుర్తించాలని చాదర్‌ఘాట్ ఇన్‌స్పెక్టర్ ఎం.రాజు అన్నారు. ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు తీసుకున్న అనంతరం సోమవారం ఆయన స్టేషన్ పరిధిలో మాట్లాడుతూ గతంలో విధులు నిర్వహించిన అధికారికి ఏవిధంగా సహాయ సహకారాలు అందించడం జరిగిందో అదేవిధంగా సహాయ సహకారాలు అందించాలని కోరారు. సమస్యాత్మక ప్రాంతాలలో నిఘా ఏర్పాటు చేస్తామని తెలిపారు. బోనాలు, మొహర్రం పండుగల నేపథ్యంలో అందరూ శాంతియుతంగా పండుగలు జరుపుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐలు పాల్గొన్నారు.

సీవరేజీ పనులు పూర్తి చేయాలని వినతి

చైతన్యపురి: చైతన్యపురి ప్రధాన రోడ్డులో అసంపూర్తిగా మిగిలిపోయిన సీవరేజీ లైన్ పనులను త్వరగా పూర్తి చేసి కాలనీవాసుల సమస్య పరిష్కారం అయ్యేలా చూడాలని చైతన్యపురి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్ మెట్రో వాటర్ అండ్ సీవరేజీ బోర్డు జనరల్ మేనేజర్ రామరాజుకు సోమవారం వినతి పత్రం సమర్పించారు. డ్రైన్ వాటర్ తరచూగా లీకేజీ జరుగుతున్న దృష్ట్యా చైతన్యపురి రెండో బస్‌స్టాప్ నుంచి ఎల్‌వి టవర్స్ వరకు నూతన సీవరేజీ లైన్ మంజూరు కాగా బాబు కాంప్లెక్స్ వరకే పనులు జరిగాయని, మిగిలిన వంద మీటర్లు లైన్ వేయాల్సి ఉండగా అర్ధాంతరంగా ఆగిపోయిందని కాలనీ అధ్యక్షుడు మల్లె కృష్ణమూర్తి జీఎంకు వివరించారు. ఇదే సమస్యపై ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్ రంగా నర్సింహ గుప్త, జీహెచ్‌ఎంజీ ఎస్‌ఇ అశోక్‌రెడ్డి, డీసీ సుజాతలకు వినతి పత్రాలు సమర్పించామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ సంఘం కార్యదర్శి జవ్వాది రామారావు, కోశాధికారి ఎవి చన్నయ్య, ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఎస్‌పి శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని వదిలేసి ఫిరాయింపులను ప్రోత్సహిస్తారా?

ఉద్యమకారుల కమిటీ చైర్మన్ న్యాలకొండ శ్రీనివాసరెడ్డి


మాట్లడుతున్న శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

దిల్‌సుఖ్‌నగర్: కాంగ్రెస్ పార్టీ అభివృద్ధిని గాలికి వదిలివేసి పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తుందని మహేశ్వరం నియోజకవర్గ ఉద్యమకారుల కమిటీ కన్వీనర్ న్యాలకొండ శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం ఆర్‌కేపురంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో పార్టీ ఫిరాయింపులను వ్యతిరేకించిన మీరే ఇప్పుడు నాయకుల ఇంటి దగ్గరికి వెళ్లి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించడం సిగ్గుచేటన్నారు. ప్రజలకు ఇచ్చిన 6 హామీలు అమలు చేయకుండా కల్లబొల్లి మాటలతో పబ్బం గడుపుతున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు తిరగబడే రోజులు దగ్గర పడ్డాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు శ్రీమన్నారాయణ, పెంబర్తి శ్రీనివాస్, రమేష్ కురుమ తదితరులు పాల్గొన్నారు.

నియామకం


దేవులపల్లి రామచంద్ర శర్మ


పోచంపల్లి రమణారావు

లింగోజిగూడ: బ్రాహ్మణ సేవా సమితి రంగారెడ్డి జిల్లా అధ్యక్షులుగా దేవులపల్లి బాలచంద్ర శర్మ, ప్రధాన కార్యదర్శిగా గంప రామారావులను నియమిస్తూ ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షులు పోచంపల్లి రమణారావు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ బ్రాహ్మణ సేవా సమితి పటిష్టతకు కృషి చేయడంతో పాటు పేద బ్రాహ్మణ కుటుంబాలను ఆదుకుంటామని తెలిపారు. విదేశాలలో విదేశీ వివేకానంద పథకం కింద చదువుకుంటున్న పేద బ్రాహ్మణ విద్యార్థులు మొదటి విడత ఫీజులు చెల్లించిన, రెండో విడత చెల్లింపు సమయానికి ప్రభుత్వం మారిందని, తెలంగాణ ప్రభుత్వం వెంటనే రెండో విడత ఫీజులు చెల్లించాలని కోరారు. ఇప్పటికే ఈ విషయాన్ని ముఖ్యమంత్రి, మంత్రుల దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని తెలిపారు.

కనుల పండువగా వారాహిదేవి నవరాత్రులు


ఎమ్మెల్సీ వాణి దేవికి అమ్మవారి జ్ఞాపికను అందజేస్తున్న ఆలయ సెక్రెటరీ మునిపల్లె శ్రీనివాస్


ప్రత్యంగిరా దేవాలయంలో కుంకుమార్చన చేస్తున్న మహిళలు

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురంలోని కుర్తాళం పీఠ శ్రీ ప్రత్యంగిరా పరమేశ్వరి మందిరంలో శ్రీ వారాహిదేవి నవరాత్రులు ఘనంగా జరుగుతున్నాయి. దీనిలో భాగంగానే సోమవారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయంలో కుంకుమార్చనలు, పారాయణలో మహిళలు అధిక సంఖ్యలో భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. ఈ పూజ కార్యక్రమంలో ఎమ్మెల్సీ వాణిదేవి, చైతన్యపురి ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్సీ వాణిదేవి మాట్లాడుతూ మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావు కుటుంబానికి కుర్తాళం పీఠంతో ఉన్న అనుబంధాన్ని తెలియజేశారు. పీఠాధిపతులు జగద్గురు శ్రీ సిద్ధేశ్వరానంద భారతి మహాస్వామి మహా మంత్ర స్వరూపులని తెలిపారు. ప్రత్యంగిరా అమ్మవారు, శ్రీవారాహిదేవి చాలా శక్తి దేవతలని వారు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ సెక్రెటరీ మునిపల్లె శ్రీనివాస్ అమ్మవారి జ్ఞాపకం అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీరామ కృష్ణాపురం కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు రామారావు, వెంకటేశ్వర్లు, విఠల్ శర్మ, సాయికుమార్ శర్మ , అరుణ తదితరులు పాల్గొన్నారు.

మరణిస్తూ ఐదుగురి జీవితాల్లో వెలుగులు

జీవన్‌ధాన్ ద్వారా రైతు అవయవాలు దానం


మండపల్లి రంగారావు (ఫైల్)

మన్సూరాబాద్: తాను మరణిస్తూ ఐదుగురి జీవితాల్లో వెలుగులు నింపాడు ఓ రైతు. వివరాల్లోకి వెళితే... ఖమ్మం జిల్లా మండ్రాజుపల్లి - నేలకొండపల్లి గ్రామానికి చెందిన మండపల్లి రంగారావు (53) గత నెల 28న ఇంట్లో అకస్మాత్తుగా కిందపడిపోయాడు. వెంటనే రంగారావును చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు ఎల్‌బీనగర్‌లోని కామినేని హాస్పిటల్‌కు తరలించారు. పరీక్షించిన కామినేని వైద్యులు ఇంటెన్సివ్ కేర్ యూనిట్ ఉంచి తొమ్మిది రోజుల పాటు చికిత్సను అందించారు. చికిత్సకు స్పందించకపోవడంతో బ్రెయిన్‌డెడ్ అయినట్లు వైద్యులు ప్రకటించారు. విషయం తెలుసుకున్న జీవన్‌ధాన్ ప్రతినిధులు రంగారావు భార్య రేణుకతో పాటు కుటుంబ సభ్యులకు అవయవ దానంపై అవగాహన కల్పించారు. దీంతో రెండు కిడ్నీలు, ఒక లివర్, రెండు కార్నియాలను జీవన్‌ధాన్‌ను నంగారావు కుటుంబ సభ్యులు అందజేశారు.

నేటి నుంచి నాటకోత్సవాలు

వనస్థలిపురం: భాషా సాంస్కృతిక శాఖ, దేవాదాయ ధర్మాదాయ శాఖల సంయుక్త సహకారంతో ఆషాఢ మాస శతాబ్ది బోనాల ఉత్సవాల సందర్భంగా శ్రీ వినాయక నాట్యమండలి (సురభి) ఆధ్వర్యంలో వనస్థలిపురం హుడా గ్రౌండ్‌లోని సురభి థియేటర్‌లో ఈ నెల 9 నుంచి 14 వరకు నాటకోత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఆర్.వేణుగోపాల్‌రావు తెలిపారు. మంగళవారం సాయంత్రం 6 గంటలకు నాటకోత్సవాన్ని దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభిస్తారని, కార్యక్రమంలో ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సెక్రటరీలు శైలజ రామయ్యర్, వాణి ప్రసాద్, దేవాదాయ శాఖ కమిషనర్ ఎం.హనుమంతరావు, కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొంటున్నట్లు ఆయన తెలిపారు.

విద్యార్థులకు నాయకత్వ లక్షణాలు కలిగేలా తీర్చిదిద్దాలి



నాగోలు: విద్యార్థులకు చదువుతోపాటు వారికి నాయకత్వ లక్షణాలు పెంపొందించేలా చేయడం ప్రతీ ఉపాధ్యాయుడి కర్తవ్యమని బచ్‌పన్–అకాడమిక్ హైట్స్ పాఠశాల డైరెక్టర్ జితేంద్రదేవి అన్నారు. సోమవారం కొత్తపేటలోని బచ్‌పన్– అకాడమిక్ హైట్స్ పాఠశాలల్లో ఇన్వెస్టిచర్ వేడుకలో భాగంగా ఎన్నుకోబడిన పాఠశాల లీడర్లకు బాడ్జీలు అందజేసి సన్మానం చేశారు. అనంతరం జితేంద్రదేవి మాట్లాడుతూ పిల్లలలో నాయకత్వ లక్షణాలు ఎక్కువగా ఉండేలా వారిని తీర్చిదిద్దాలని అన్నారు. విద్యార్థులను అందరిలో మాట్లడేందుకు ధైర్యాన్ని నింపి వారిలోకి భయాన్ని, బిడియాన్ని పోగొట్టే నాయకత్వ లక్ష్మణాలు పెంచే బాధ్యత టీచర్లు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జి స్వీటీ, ఉపాధ్యాయులు తదితతరులు పాల్గొన్నారు.

రజనీ గోవింద్‌కు డాక్టరేట్



మన్సూరాబాద్: డివిజన్ పరిధి ఆదిత్యానగర్‌కాలనీకి చెందిన ప్రముఖ కర్ణాటక సంగీత విద్యాంసురాలు రజనీగోవింద్ డాక్టరేట్ అవార్డుకు ఎంపికయ్యారు. గత 25 సంవత్సరాలుగా రజనీగోవింద్ సంగీతంలో చేస్తున్న సేవలను గుర్తిస్తూ ఆసియా ఇంటర్నేషనల్ కల్చర్ రిసెర్చ్ యూనివర్సిటీ ఈనెల 13న తెలంగాణ సారస్వతిక పరిషత్ ఆడిటోరియంలో జరిగే కార్యక్రమంలో డాక్టరేట్‌ను ప్రదానం చేయనున్నారు. రజనీగోవింద్ తెలుగు యూనివర్సిటీ నుంచి గాత్రం, వయోలిన్, కర్ణాటక సంగీతంలో ఎంఎ పట్టా పొందారు. 2017 నుంచి రాష్ట్ర గురుకుల కళాశాల సంగీత అధ్యాపకురాలిగా ఎంపికై మారుమూల ప్రాంతంలోని విద్యార్థులకు నిత్యం సంగీతంలో శిక్షణ ఇస్తూ వారిని జాతీయస్థాయి పోటీలలో రాణించేందుకు తీర్చిదిద్దారు.

ప్రజావాణిలో ఫిర్యాదుల వెల్లువ


ఫిర్యాదులు స్వీకరిస్తున్న డీసీ యాదయ్య

ఎల్‌బీనగర్: ప్రభుత్వ ఆదేశాలు మేరకు ఎల్‌బీనగర్ జోనల్, సర్కిల్ కార్యాలయాల్లో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. జోనల్ కార్యాలయంలో మొత్తం 12 ఫిర్యాదులు రాగా అందులో 7 టౌన్ ప్లానింగ్, 4 ఇంజినీరింగ్, యూబిడిలో ఒక ఫిర్యాదు వచ్చినట్లు అధికారులు తెలిపారు. హయత్‌నగర్ సర్కిల్ పరిధిలో మొత్తం 4 ఫిర్యాదులు రాగా అందులో ఇంజినీరింగ్ 02, ఆస్తిపన్ను సమస్యలపై 02 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. వచ్చిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.

హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన


తహశీల్దార్ జయశ్రీకి మెమోరాండం అందజేస్తున్న కిసాన్ మోర్చా నేతలు

మలక్‌పేట: రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం కమిటీల పేరుతో కాలయాపన చేస్తుందని బీజేపీ కిసాన్ మోర్చా భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు మడిగల లక్ష్మారెడ్డి ఆరోపించారు. మేనిఫెస్టోలో రైతుల కోసం పొందుపరిచిన హామీలను నెరవేర్చాలని కోరుతూ సోమవారం సైదాబాద్ తహశీల్దార్ జయశ్రీకి మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ మొదలై నెల రోజులు దాటినా 'రైతు భరోసా' పేరుతో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాటను నిలబెట్టుకోలేదన్నారు. ఎలాంటి షరతులు లేకుండా రూ. 2 లక్షలు రైతు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. సమగ్ర పంటల బీమా పథకాన్ని అమలు చేస్తామని చెప్పిన మాట ఊసే లేదన్నారు. కౌలు రైతులకు రూ.15 వేలు ఆర్థిక తోడ్పాటు అందించి వారిని ఆదుకోవాలన్నారు. వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ. 12 వేలు పథకం తక్షణమే అమలు చేయాలన్నారు. ప్రధాన మంత్రి పంట బీమా యోజనను అమలు చేయాలని లేనిపక్షంలో కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో రైతుల పక్షాన ఆందోళనలు తీవ్రతరం చేస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్‌రెడ్డి, కార్యదర్శి యాదగిరి సురేందర్, సీనియర్ నాయకుడు ప్రభాకర్‌రావు, మూసారంబాగ్ డివిజన్ అధ్యక్షుడు కొప్పుల దినేష్ తదితరులు ఉన్నారు.

గుర్తు తెలియని మహిళ మృతి

చాదర్‌ఘాట్: గుర్తు తెలియని మహిళ మృతదేహం లభించిన సంఘటన చాదర్‌ఘాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ శివాజీ తెలిపిన వివరాల ప్రకారం... నల్గొండ ఫ్లైఓవర్ పక్కన అక్షర ప్లాజాలో గుర్తు తెలియని మహిళ మృతదేహం (50) పడి ఉంది. దీంతో చుట్టుపక్కల వారు చూసి పోలీసులకు సమాచారం అందించగా ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ఎవరైనా మహిళ గురించి వివరాలు తెలిజేయాలంటే 8712572087ను సంప్రదించాలని ఆయన తెలిపారు.

అనారోగ్యంతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి

నాగోలు: నాగోల్ సాయినగర్ కాలనీలో అద్దె ఇంట్లో ఉంటున్న సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మృతదేహం లభ్యమైన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం...రెండు నెలల నుంచి నల్గొండ జిల్లా తిప్పర్తికి చెందిన తెరతేపల్లి నరేష్ (35) సాయినగర్ కాలనీ రోడ్డు నెంబర్ 4లో అద్దె ఇంట్లో ఉండేవాడు. నరేష్ బెంగళూరు సాఫ్ట్‌వేర్ కంపెనీ ఉద్యోగి కాగా, ఇంటి నుంచే పనులు నిర్వర్తించేవాడు. నరేష్ భార్య ప్రసవానికి మిర్యాలగూడ వెళ్లింది. ఇదిలా ఉండగా నరేష్ హైబీపీతో కొంతకాలంగా ఇబ్బంది పడుతున్నాడు. ఆదివారం అతడు ఉండే పోర్షన్ నుంచి దుర్వాసన వస్తుండడంతో ఇంటి ఓనర్ మూర్తి 100కు డయల్ చేసి సమాచారం ఇచ్చాడు. ఈ విషయం తెలుసుకున్న నాగోలు పోలీస్‌లు ఘటనా స్థలానికి చేరుకుని ఇంటి డోర్ పగలగొట్టి లోపలికి వెళ్లి చూడగా నరేష్ మృతి చెంది ఉన్నాడు. దీంతో నరేష్ తండ్రి రమేష్‌కు సమాచారం అందించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా హాస్పిటల్‌కు తరలించారు. మృతుడి తండ్రి రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.